ఎండైనా.. వానైనా.. ఆరుబయటే నిరీక్షణ

- బస్ షెల్టర్లు లేక ప్రయాణికుల అవస్థలు
- ఉన్న ఒకటీ అరా శిథిలం
- రోడ్డు పక్క దుకాణాలు.. చెట్లే శరణ్యం



బైపాస్ రోడ్డులో విజయనగరం వైపు వెళ్లే బస్సుల కోసం ఆరు బయట వేచి ఉన్న ప్రయాణికులు



అంబేద్కర్ కూడలి వద్ద రహదారి పైనే వేచి ఉన్న ప్రయాణికులు

తగరపువలస: భీమిలి నియోజకవర్గంలోని ముఖ్యమైన కూడళ్లలో బస్ షెల్టర్లు లేక ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. ఇటీవల వరకు ఎండకు ఎండిన ప్రయాణికులు ఇప్పుడు వర్షాలకు తడుస్తూ తాము చేరుకోవలసిన గమ్యానికి చేర్చే వాహనాల కోసం ఎదురు చూస్తున్నారు. నియోజకవర్గంలో చాలా బస్ షెల్టర్లు శివారు ప్రాంతాల్లోనే ఉన్నాయి. అవి కూడా చాలా వరకు శిథిలమైపోయాయి. రహదారుల విస్తరణలో లోపాల కారణంగా ఎక్కడ చూసిన హైవేతో పాటు సర్వీస్ రోడ్లపై కూడా వర్షం నీరు నిలిచిపోతోంది. దీంతో ఆయా గ్రామాల వద్ద బస్సుల కోసం రహదారులపై వేచి ఉండే ప్రయాణికులపై వాహనాలు నీళ్లు తుళ్లిస్తూ ఇబ్బందులు కలిగిస్తున్నాయి.

గ్రామీణ ప్రాంతాల్లోనూ అదే పరిస్థితి..

నియోజకవర్గంలోని పట్టణ ప్రాంతాలైన తగరపువలస, భీమిలి, మధురవాడ, పీఎం పాలెం, కొమ్మాది తదితర ప్రాంతాలతో పాటు భీమిలి, పద్మనాభం, ఆనందపురం మండలాల్లోని 63 పంచాయతీల్లోనూ ప్రయాణికులు వేచి ఉండటానికి బస్ షెల్టర్లు లేవనే చెప్పాలి. ఒకటో రెండో ఉన్నా అవి గ్రామాలకు దూరంగా నిరుపయోగంగా ఉండటంతో పాటు బిచ్చగాళ్ల తల దాచుకోవడానికో, స్థానికులు సామాన్లు భద్రపరచుకోవడానికో, ఆకతాయిలు తిష్ట వేయడానికో పనికొస్తున్నాయి. ఏ ఒక్క చోట కూడా ప్రయాణికులు వేచి ఉండటానికి అనుకూలంగా లేవు. అందుకు జీవీఎంసీ గాని పంచాయతీలు గాని బాధ్యత తీసుకోవడం లేదు. గతి లేక ప్రయాణికులు బస్టాపుల సమీపంలోని దుకాణాల వద్ద, ఫ్లై ఓవర్ల కింద వేచి ఉంటున్నారు. పూర్వపు షెల్టర్లు రహదారుల విస్తరణ పేరుతో కనుమరుగు అయిపోయాయి.



తాళ్లవలస శివారులో నిరుపయోగంగా బస్ షెల్టర్



ఆనందపురం మండలం పెద్దిపాలెం పంచాయతీకి దూరంగా నిరుపయోగంగా బస్ షెల్టర్



విశాఖ వెళ్లే బస్సుల కోసం హైవేపై వర్షంలో వేచి ఉన్న ప్రయాణికులు



శ్రీకాకుళం వెళ్లే బస్సుల కోసం వెంకటేశ్వరమెట్ట వద్ద హైవేపై వర్షంలో వేచి ఉన్న ప్రయాణికులు

ప్రయాణికులకు ఎలాంటి ఆధారం లేదు



ప్రతిరోజూ వివిధ వర్గాల ప్రజలు వారి పనుల మీద ఇతర ప్రాంతాలకు వెళ్లేందుకు ఆటోలు, బస్సుల కోసం కొద్దో గొప్పో సమయం వేచి ఉండటం మామూలే. ఎండా కాలంలో ఏదో చెట్టు కింద నిలబడినా వర్షాకాలంలో సాధ్యం కాదు. పైగా చెట్లు కూడా పెద్దగా లేవు.

– కేపీ సత్యనారాయణ, శింగనబంధ

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రాధాన్యం ఇచ్చింది



గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం జీవీఎంసీ పరిధిలో అధునాతన బస్ షెల్టర్లు నిర్మించి ప్రయాణికుల అందుబాటులో ఉంచింది. అలాగే పార్లమెంట్ సభ్యులు తమ నిధులను ఆయా చోట్ల బస్ షెల్టర్లకు కేటాయించేవారు. ఇటీవల బస్ షెల్టర్లకు ప్రాధాన్యత తగ్గింది.

– దుంపల ప్రభాకర్, తాటితూరు

నిలువ నీడ కల్పించకపోతే ఎలా?



కార్పొరేట్ సంస్థలు, విద్యాలయాలు తమ వ్యాపార ప్రకటనల కోసం ఉన్న బస్ షెల్టర్లను వినియోగించుకుంటాయి. కానీ వారు ప్రయాణికుల అవసరాలను గుర్తించి షెల్టర్లు నిర్మించడం లేదు. గతంలో దాతలు వారి పేరు మీద బస్ షెల్టర్లు నిర్మించేవారు. మళ్లీ అలాంటి పరిస్థితి రావాలి.

– పల్ల వెంకటరావు, టి.నగరపాలెం

భవన నిర్మాణ కార్మికులను పట్టించుకోని ప్రభుత్వం



కొమ్మాది జంక్షన్ వద్ద పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు, భవన నిర్మాణ కార్మికులు

మధురవాడ: భవన నిర్మాణ కార్మికుల సమస్యలను కూటమి ప్రభుత్వం పట్టించుకోవడం లేదని బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ విశాఖ జిల్లా ఉపాధ్యక్షుడు పేడాడ రాజశేఖర్ అన్నారు. ఆదివారం ఉదయం కొమ్మాది జంక్షన్ ఏకే ప్యాషన్స్ సెంటర్ వద్ద భవన నిర్మాణ కార్మికుల నిరసన కార్యక్రమ పోస్టర్‌ను సీఐటీయూ నాయకుడు పి.రాజ్‌కుమార్‌తో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి నాయకులు ఎన్నికల సమయంలో కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 15న విజయవాడలో భారీ నిరసన కార్యక్రమం నిర్వహించనున్నామని తెలిపారు.రాజ్‌కుమార్, టి.తిరుపతిరావు, వెంకటేష్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం

తగరపువలస: పద్మనాభం మండలం విజయరాంపురం గ్రామానికి చెందిన త్రైత సిద్ధాంత భగవద్గీత ఆదికర్త ఆచార్య ప్రబోధానందుని శిష్యులు ఆదివారం భీమిలి మండలం దాకమర్రిలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. శ్రీకృష్ణుడే జగద్గురువని అంతా తెలుసుకోవాలన్నారు. అలాంటి శ్రీకృష్ణ భగవానుడి ఊరేగింపు ఊరూరా చేరాలన్నారు. ఈ ప్రచార కార్యక్రమంలో కె.త్రినాథరావు, వి.సురేష్, జి.సన్యాసి, సంతోష్, లక్ష్మి, రాజు, భవానీ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి యోగా పోటీలకు శిరీష



యోగా పోటీలకు ఎంపికైన శిరీష

పద్మనాభం: మండలంలోని కృష్ణాపురం పంచాయతీ కృష్ణాపురం కాలనీకి చెందిన చలపాక శిరీష జాతీయ స్థాయి యోగా పోటీలకు ఎంపికయింది. విజయవాడ సమీపంలోని ద్వారకా తిరుమలలో ఈ నెల 6, 7 తేదీల్లో నిర్వహించిన యోగా ఫెడరేషన్ ఆఫ్ ఇండియా స్టేట్ చాంపియన్ షిప్ 2025 పోటీల్లో మొదటి స్థానం కైవశం చేసుకుని జాతీయ స్థాయి యోగా పోటీలకు ఎంపికై ంది. త్వరలో మైసూరులో జరగబోయే జాతీయ స్థాయి యోగా పోటీల్లో శిరీష పాల్గొంటుంది.

తీరాన్ని శుభ్రంగా ఉంచాలి

కొమ్మాది: వినాయక నవరాత్రి మహోత్సవాలు ముగియడంతో బీచ్‌లో విగ్రహాలు నిమజ్జనం చేసిన చోట తీరానికి సామగ్రి, కరగని విగ్రహాలు కొట్టుకొస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఐటీ జంక్షన్ బీచ్, సాగర్‌నగర్ బీచ్‌లను జోన్ – 2 కమిషనర్ కె.కనకమహాలక్ష్మి ఆదివారం పరిశీలించారు. తీరానికి కొట్టుకొస్తున్న విగ్రహాలు, పూజా సామగ్రి త్వరితగతిన తొలగించాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవికి సూచించారు. పర్యాటకులకు ఇబ్బందులు లేకుండా పరిశుభ్రంగా ఉంచాలన్నారు. 8వ వార్డులో పాలిథిన్ నిషేధించాలని అధికారులకు సూచించారు.

21 నుంచి సౌత్‌జోన్ కరాటే టోర్నమెంట్



బెల్టులు పొందిన వారితో అసోసియేషన్ సభ్యులు



బెల్ట్‌గ్రేడింగ్ ధ్రువీకరణ పత్రాలతో విద్యార్థులు

తగరపువలస: సౌత్ జోన్ కరాటే టోర్నమెంట్ ఈ నెల 21 నుంచి మధురవాడలో నిర్వహించనున్నట్టు ఆల్ ఇండియా మార్షల్ ఆర్ట్స్ చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ అండ్ ఎగ్జామినర్ పి.నరసింహారావు తెలిపారు. ఆదివారం సాయంత్రం భీమిలి మండలం రేఖవానిపాలెం పంచాయతీ మహాలక్ష్మీపురంలో నిర్వహించిన బెల్టు గ్రేడింగ్ పోటీల్లో అర్హులైన వారికి బెల్టులు, సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ సౌత్‌జోన్ టోర్నమెంట్‌కు 6 రాష్ట్రాల నుంచి అభ్యర్థులు పాల్గొంటారన్నారు. ఆ టోర్నమెంట్‌లో పాల్గొనే విద్యార్థులకు పోటీలు నిర్వహించి ఎంపిక చేస్తామన్నారు. చీఫ్ కోచ్ జి.శివరామకృష్ణ, బ్లాక్ బెల్ట్ గ్రహీత కమ్ కోచ్‌లు బంగారు పరదేశి, పృధ్వీరాజ్, శ్యామ్‌ప్రసాద్, కర్రి చిట్టిబాబు, బంగారు గౌతం తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బెల్ట్‌గ్రేడింగ్ టెస్ట్‌లు

భీమునిపట్నం: భీమిలిలోని షోటోకాన్ కరాటే అసోసియేషన్ కోచ్ ముగడ రమణయాదవ్ ఆధ్వర్యంలో కరాటే బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్ సెయింట్ ఆన్స్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం నిర్వహించారు. సుమారు 30 మంది విద్యార్థులు పాల్గొనగా వారిలో పది మంది ఎల్లో బెల్ట్, ముగ్గురు గ్రీన్‌బెల్ట్, ముగ్గురు బ్రౌన్‌బెల్ట్, ఒకరు బ్లూబెల్ట్ సాధించారు. వారికి బెల్ట్‌లు, ధ్రువీకరణ పత్రాలను కోచ్ అందించారు. పాఠశాల ప్రిన్సిపాల్ సిస్టర్ క్రిస్టిజాన్, వైస్ ప్రిన్సిపాల్ సిస్టర్ మాబెల్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సత్కారం



ఎన్ఎంఎంఎస్ శిక్షణలో పాల్గొన్న ఉపాధ్యాయులు



సత్కారం పొందిన ఉపాధ్యాయులతో సురేష్‌బాబు

తగరపువలస: చిట్టివలస జెడ్పీ హైస్కూల్‌లో ఫ్రెండ్స్ ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో జరుగుతున్న నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ ఉచిత శిక్షణ కార్యక్రమంలో భాగంగా నిర్వాహకులు ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. వీరిలో ఇటీవల జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు పొందిన వారితో పాటు ఇటీవల పదవీ విరమణ చేసిన ఉపాధ్యాయులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో రేఖ అప్పారావు, జీవీ అప్పారావు, రవ్వ భరత్, పక్కి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

భీమునిపట్నం: భీమిలి సమీపంలోని కీతిన్‌పేట వద్ద గల పురాతన సెయింట్ పీటర్స్ చర్చిలో ఉపాధ్యాయులను చర్చి గౌరవ కార్యదర్శి కులిడి సురేష్‌బాబు ఆధ్వర్యంలో ఆదివారం సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి ఎంతో ఉన్నతమైనదన్నారు. విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలని కోరారు. అనంతరం పాస్టర్ రెవరెండ్ చైతన్యకుమార్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

పవర్ డిస్ట్రిబ్యూషన్ బాక్స్ సరి చేశారు



కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు ఎస్ఎల్‌పీ లేఅవుట్ సమీపంలో అండర్ విద్యుత్ వైర్లకు సంబంధించిన ఫీడర్ పిల్లర్ ఒక వైపునకు పూర్తిగా ఒరిగిపోయింది. దీంతో సాక్షి దిన పత్రికలో ఆదివారం 'ఒరిగిపోయిన ఫీడర్ పిల్లర్' శీర్షికతో ప్రచురించిన వార్తకు ఏఈ చక్రవర్తి స్పందించారు. ఒరిగిన పవర్ డిస్ట్రిబ్యూషన్ బాక్స్‌ను సరి చేశారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

అన్నదాత పోరుకు తరలిరండి

కూటమి ప్రభుత్వ పాలనలో వ్యవసాయ రంగం అతలాకుతలం • వైఎస్సార్ సీపీ భీమునిపట్నం సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు



మాట్లాడుతున్న మజ్జి శ్రీనివాసరావు



అన్నదాత పోరు పోస్టర్ ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ భీమునిపట్నం నియోజకవర్గ సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు, ఎంపీపీలు, జెడ్పీటీసీ సభ్యులు, పార్టీ మండలాల అధ్యక్షులు, నాయకులు

పద్మనాభం: రైతన్నలకు మద్దతుగా, యూరియా బ్లాక్ మార్కెట్‌కు తరలిపోతున్న వైనానికి వ్యతిరేకంగా నియోజకవర్గ కేంద్రం భీమునిపట్నంలో ఈ నెల 9న నిర్వహించనున్న అన్నదాత పోరుకు రైతులంతా తరలిరావాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) కోరారు. పద్మనాభం జంక్షన్‌లోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆనందపురం, పద్మనాభం, భీమునిపట్నం మండలాల నాయకులు, కార్యకర్తలతో అన్నదాత పోరుపై ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 9న మధ్యాహ్నం 3 గంటలకు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, రైతులు అధిక సంఖ్యలో భీమునిపట్నం ఎంపీడీవో కార్యాలయం వద్దకు చేరుకోవాలని కోరారు. ఎంపీడీవో కార్యాలయం నుంచి పాదయాత్రగా బయలుదేరి ఆర్డీవో కార్యాలయానికి వెళ్లి వినతిపత్రం అందిస్తామన్నారు. వరి పంట సాగుకు ప్రధాన ఎరువులు యూరియా, డీఏపీ అందక రైతులు అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. యూరియా బస్తా బ్లాక్ మార్కెట్‌లో రూ.600కు అమ్ముతున్నారన్నారు. బ్లాక్ మార్కెట్ వద్ద రైతులు ఉదయం నాలుగు గంటల నుంచి క్యూలో పడి గాపులు కాస్తున్నారని వాపోయారు. అన్నదాతలు అధిక ధరకు యూరియా కొనుగోలు చేసి వరి పైరుకు వేయలేక పోతున్నారన్నారు. యూరియా కోసం రైతులు క్యూలో నిల్చుంటే తప్పేంటని సంబంధిత మంత్రి అనడం ఎంత వరకు సమంజసమన్నారు. భోజనాల కోసం క్యూలో నిలబడ లేదా అని అన్నదాతలను చులకనగా మాట్లాడారని మండిపడ్డారు.

ఆర్బీకేలను నిర్వీర్యం చేసిన కూటమి పాలకులు

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రైతు భరోసా కేంద్రాల (ఆర్బీకే) ద్వారా అన్నదాతలకు సకాలంలో ఎరువులు అందించామని మజ్జి శ్రీనివాసరావు గుర్తు చేశారు. కియోస్క్‌లో నమోదు చేసుకున్న రైతులకు వెంటనే ఎరువులు సరఫరా చేసేవారన్నారు. కూటమి పాలనలో రైతు భరోసా కేంద్రాలను నిర్వీర్యం చేశారన్నారు. అన్నదాత సుఖీభవ పథకం కింద ఈనాం రైతులకు డబ్బులు ఇవ్వలేదన్నారు. జిరాయితీ భూముల రైతులకు కూడా మొదటి ఏడాది పెట్టుబడి సాయం అందించకుండా మోసం చేశారన్నారు. రెండో ఏడాది కేంద్రం ఇచ్చిన రూ.2 వేలు కలిపి రూ.7 వేలు మాత్రమే ఇచ్చారన్నారు. అన్నదాతలకు చేయాల్సిన సాయంపై కూటమి ప్రభుత్వం అధికారులతో సమీక్షలు నిర్వహించడం లేదన్నారు. రైతు బాగుంటేనే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందన్న సదుద్దేశంతో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పంటలకు సాగు నీరు అందించేందుకు 32 ప్రాజెక్టులు నిర్మించారని గుర్తు చేశారు. వ్యవసాయ రంగానికి ఉచితంగా విద్యుత్ సరఫరా చేశారన్నారు. అనంతరం అన్నదాత పోరు పోస్టర్ ఆవిష్కరించారు. సమావేశంలో జెడ్పీ వైస్ చైర్మన్ సుంకర గిరిబాబు, ఎంపీపీలు కంటుబోతు రాంబాబు, దంతులూరి వాసురాజు, ఆనందపురం జెడ్పీటీసీ సభ్యుడు కోరాడ వెంకటరావు, వైఎస్సార్ సీపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు బోని అప్పలనాయుడు, పార్టీ పద్మనాభం, భీమునిపట్నం, ఆనందపురం మండలాల అధ్యక్షులు కోరాడ లక్ష్మణరావు, డొకర శ్రీను, బంక సత్యం, నాయకులు మజ్జి వెంకటరావు, ఈర్ల ఈశ్వరరావు, సుంకర బంగారప్పడు, బుగత సత్యనారాయణ, షిణగం దాము పాల్గొన్నారు.

నాయకులు, కార్యకర్తలకు అండగా ఉంటాం



పోతిన హనుమంతరావు నివాసం వద్ద మాట్లాడుతున్న మజ్జి శ్రీనివాసరావు

మధురవాడ: వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందని విజయనగరం జిల్లా పరిషత్ చైర్మన్, భీమిలి నియోజకవర్గం సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) చెప్పారు. ఆదివారం మధ్యాహ్నం కూటమి ప్రభుత్వం కక్ష సాధింపు చర్యల్లో భాగంగా మధురవాడలో కూలగొట్టిన మాజీ కార్పొరేటర్ పోతిన హనుమంతరావు నివాస భవనం ప్రహరీ, పోర్టుకోని ఆయన పరిశీలించారు. అధికారులు తొలగించడానికి కారణాలు, ఆ సందర్భంగా జరిగిన పరిణామాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ తాను అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో 5వ వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు పోతిన హనుమంతరావు, నాయకులు పోతిన ప్రసాద్, పోతిన సురేష్, గండిగుండం శ్రీను, చేకూరి రజని పాల్గొన్నారు.

గాజువాక సభను జయప్రదం చేయాలి



చిట్టివలసలో ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఎం, సీఐటీయూ నాయకులు

తగరపువలస: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను నిలిపివేయాలని కోరుతూ ఈ నెల 11న పాత గాజువాక వద్ద నిర్వహించనున్న భారీ బహిరంగ సభను జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు కోరారు. ఈ మేరకు ఆదివారం చిట్టివలస జ్యూట్‌మిల్లు కల్యాణ మండపంలో సమావేశం నిర్వహించారు. అనంతరం సీపీఎం, సీఐటీయూ నాయకులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈవోఐ పేరుతో స్టీల్‌ప్లాంట్ అమ్మకాన్ని కూటమి ప్రభుత్వం అడ్డుకోవాలన్నారు. అలాగే అదానీ విద్యుత్ ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లు కూడా బిగించొద్దని డిమాండ్ చేశారు. కూటమి నాయకులు స్టీల్‌ప్లాంట్ విక్రయాన్ని అడ్డుకుంటామని హామీ ఇచ్చి ఇప్పుడు నోరు మెదపడం లేదన్నారు. దీనిపై అన్నివర్గాల ప్రజలను అప్రమత్తం చేస్తూ ఈ నెల 11 వరకు అవగాహన కల్పిస్తామన్నారు. ఆర్ఎస్ఎన్ మూర్తి, ఎస్.అప్పలనాయుడు, నీలాటి రాము, దామోదర బాబాజీ, బెల్లాన రామకృష్ణ పాల్గొన్నారు.

చంద్రగ్రహణం ప్రభావంతో ఆలయాల మూసివేత



చంద్రంపాలెంలో దుర్గాలమ్మ ఆలయ తలుపులు మూసేస్తున్న అర్చకుడు



సంగివలస ముగ్గురు అమ్మవార్ల ఆలయం వద్ద విగ్రహాలకు తెరలు వేసిన అర్చకులు

తగరపువలస: చంద్రగ్రహణం సందర్భంగా ఆదివారం మధ్యాహ్నం నుంచి భీమిలిలోని పలు ఆలయాలు మూతపడ్డాయి. ఉదయం పూజా కార్యక్రమాలు ముగిసిన తర్వాత మధ్యాహ్నం వరకు భక్తులను ఆలయాల్లోకి అనుమతించారు. తర్వాత ఆలయాల తలుపులు మూసేశారు. సోమవారం ఉదయం ఆలయాలను శుద్ధి చేసిన అనంతరం భక్తులకు దర్శనాలు కల్పించనున్నారు. జాతీయ రహదారిని ఆనుకుని సంగివలస వద్ద దేవదాయశాఖ ఆధ్వర్యంలో ఉన్న ముగ్గురు అమ్మవార్లు కనిపించకుండా తెరలు వేశారు.

మధురవాడ: చంద్రగ్రహణం కారణంగా మధురవాడలోని వివిధ ఆలయాలు మూతపడ్డాయి. చంద్రంపాలెం జాతర గట్టు దుర్గాలమ్మ ఆలయం, బాలాజీ హిల్స్‌పై వెలసిన వేంకటేశ్వరస్వామి ఆలయం, సిద్ధేశ్వర స్వామి పీఠంలోని ఆలయాలతోపాటు మధురవాడలోని ఇతర ఆలయాలు కూడా ఆదివారం మధ్యాహ్నం మూసేశారు. గ్రహణం విడిచిన తర్వాత సంప్రోక్షణ అనంతరం భక్తులకు దర్శనాలు కల్పిస్తామని నిర్వాహకులు, అర్చకులు తెలిపారు.

పెన్షనర్ల సదస్సును జయప్రదం చేయండి

తగరపువలస: 12 ఏళ్లుగా కనీస పెన్షన్ పెంపు, డీఏ, రైల్వేలో రాయితీ పునరుద్ధరణ తదితర సమస్యలపై పోరాటం చేస్తున్నా ప్రధాని మోదీ కనికరించడం లేదని, ఈ పోరాటాలలో భాగంగా ఈ నెల 13న విజయవాడలో నిర్వహించే పెన్షనర్ల సదస్సును జయప్రదం చేయాలని చిట్టివలస జ్యూట్‌మిల్లు పెన్షనర్ల సంఘం కోరింది. ఆదివారం గుజ్జు రామునాయుడు భవన్‌లో జరిగిన పెన్షనర్ల సమావేశంలో పలువురు నాయకులు మాట్లాడారు. ఈ సమావేశంలో దామోదర బాబాజీ, కానూరి రాంబాబు, మోర అప్పలరాజు, పంపాన సూర్యనారాయణ పాల్గొన్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరికి గాయాలు

తగరపువలస : ఆనందపురం మండలం వెల్లంకి జాతీయ రహదారిపై శ్రీకాకుళం జిల్లాకు చెందిన ద్విచక్ర వాహనదారుడిని ఆదివారం మధ్యాహ్నం గుర్తు తెలియని వాహనం బలంగా ఢీకొనడంతో కాలు విరిగిపోయింది. క్షతగాత్రుడు ప్రమాద వివరాలు, తన వివరాలు చెప్పలేకపోతున్నాడు. ఆ ప్రాంతంలో సీసీ కెమెరాల ఆధారంగా ప్రమాదానికి కారకులను ఆనందపురం పోలీసులు గుర్తించాల్సి ఉంది. 108 సిబ్బంది క్షతగాత్రుడిని కేజీహెచ్‌లో చేర్పించారు. అలాగే ఆనందపురం మండలం పెద్దిపాలెం ప్యారడైజ్ హోటల్ వద్ద తగరపువలస వైపు వెళ్తున్న ద్విచక్ర వాహనదారుడిని శనివారం కారు ఢీకొంది. క్షతగాత్రునికి తీవ్రంగా గాయాలు కావడంతో ఆనందపురం పోలీసులు సంగివలస అనిల్ నీరుకొండ ఆస్పత్రికి తరలించి దర్యాప్తు చేస్తున్నారు.

పద్మనాభం ఎంపీడీవోకు పదోన్నతి

పద్మనాభం: పద్మనాభం ఎంపీడీవోగా పని చేస్తున్న ఎం.విజయ కుమార్‌కు డీడీవోగా పదోన్నతి లభించింది. ఏఎస్ఆర్ జిల్లా చింతూరు డివిజినల్ డవలప్‌మెంటు ఆఫీసర్‌గా పదోన్నతి లభించింది. ఈ మేరకు రూరల్ డవలప్‌మెంట్ అండ్ పంచాయతీరాజ్ శాఖ రాష్ట్ర అధికారులు ఉత్వర్వులు జారీ చేశారు.

ఇస్కాన్‌లో హరినామస్మరణ



ప్రత్యేక అలంకరణలో శ్రీరాధాకృష్ణులు

కొమ్మాది: హరేకృష్ణ, హరేరామ అంటూ సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరం హరినామస్మరణతో మార్మోగింది. వారాంతపు పూజల సందర్భంగా ఇస్కాన్ అధ్యక్షులు సాంబదాస్ ప్ర భూజీ, మాతాజీ నితాయి సేవిని భగవద్గీత శ్లోకాలు, ప్రవచనాలు ఆదివారం ఆలపించారు. రాధాకృష్ణులు, సుభద్ర, బలభద్ర జగన్నాథుడు, సీతారాములు, ఆంజనేయ, నరసింహస్వామి విగ్రహాలను వివిధ వర్ణాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు.

ఆయుర్వేద వైద్య విద్యలో స్టేట్ టాపర్ సాయిశ్రీనిజ



కొండవీటి సాయి శ్రీనిజ

తగరపువలస: ఆనందపురం మండలం వేములవలస సత్యకల్యాణి అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటున్న కొండవీటి శంకర్‌సాయి, రాజరాజేశ్వరిల కుమార్తె సాయి శ్రీనిజ బ్యాచిలర్ ఆఫ్ ఆయుర్వేదిక్ మెడిసిన్ అండ్ సర్జరీలో(బీఏఎంఎస్) స్టేట్ టాపర్‌గా నిలిచింది. 2023–24 విద్యాసంవత్సరానికి గాను డాక్టర్ ఎన్టీఆర్ వైద్య విశ్వవిద్యాలయం నిర్వహించిన బీఏఎంఎస్ కోర్సులో రాష్ట్రంలోనే అత్యధిక మార్కులతో ప్రథమ స్థానంలో నిలిచింది. అంతే కాకుండా రెండు సబ్జెక్టులలో స్టేట్ టాపర్‌గా, విజయవాడలోని డాక్టర్ నోరి రామశాస్త్రి ఆయుర్వేదిక్ కళాశాల బెస్ట్ అవుట్ గోయింగ్ స్టూడెంట్‌గా కూడా ఎంపికయింది. ఈ నెల 9న విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగే స్నాతకోత్సవ సభలో మూడు బంగారు పతకాలు, ఒక సిల్వర్ మెడల్ స్వీకరించనుంది. ప్రస్తుతం సాయిశ్రీనిజ తిరుపతిలోని శ్రీవెంకటేశ్వర ఆయుర్వేద వైద్య విద్యాలయంలో కౌమారభృత్య (ఎండీ, పీడియాట్రిక్స్) చేస్తోంది. ఈమె స్వస్థలం తెనాలి.